జీవన ఎరువులు భేష్

- సేంద్రియ, రసాయనిక ఎరువులతో కలిసి వాడాలి
- ఇదే సమీకృత ఎరువుల యాజమాన్య పద్ధతి
- మొక్కల ఎదుగుదలకు అన్ని విధాలా మేలు
- ఇతర ఎరువులతో పోలిస్తే ధర తక్కువ

- 8లో

యూరియా విక్రయాలపై నిఘా

కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు

- కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు
- ఐదుగురిపై 6ఏ కేసులు, 7 ఎఫ్ఐఆర్ నమోదు
- 66.24 టన్నుల అక్రమ నిల్వలు స్వాధీనం



ఎరువుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

యూరియా కృత్రిమ కొరత, అక్రమాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. డీలర్లు, పీఏసీఎస్‌లలో రికార్డుల నిర్వహణతో పాటు విస్తృత తనిఖీలు జరుపుతున్నారు. ఈ దాడుల్లో ఇప్పటికే 66.24 టన్నుల యూరియా అక్రమ నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీద 13 మందిపై కేసులు నమోదు చేశారు.

ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు అంచనాల మేరకు విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందిస్తారు. ఈ ఎరువులను కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో లైసెన్స్ పొందిన రిటైల్ డీలర్లు, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీ ధరకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో కొందరు స్థానిక రాజకీయ నాయకులు, డీలర్లు ఏకమై ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఎరువులు అందకుండా చేస్తున్నారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించే కొందరు వ్యాపారులు, స్థానిక ప్రజాప్రతినిధులపై వ్యవసాయ శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా పెట్టింది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో 24 మండలాలకు 19,178 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ఇండెంట్ పెట్టింది. ఇప్పటికే 13,111 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయి. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం 17,720 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉండగా.. 14,374 మెట్రిక్ టన్నులు రైతులకు సబ్సిడీపై విక్రయించారు. అవసరం మేరకు ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి అదనపు నిల్వలు జిల్లాకు చేరేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వాస్తవానికి అధికారుల నివేదికల ప్రకారం ఈ ఏడాది ఎరువుల సరఫరా తగినంతగా ఉన్నప్పటికీ, కొంతమంది డీలర్లు, పీఏసీఎస్‌ల నిర్వాహకులు స్థానిక చోటా నాయకులతో కలిసి నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సమస్య సృష్టిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. యూరియా అమ్మకాలు రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద ఈ-పోస్ యంత్రాల ద్వారా నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లాలో కొన్ని మండలాల్లో పీఏసీఎస్‌లలో ఈ-పోస్ యంత్రాలను వినియోగించకుండా కేవలం రైతుల ఆధార్ కార్డుల నంబర్లపై యూరియా నిల్వలను పక్కదారి పట్టిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా అనుమతి పొందిన కొందరు ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు దొడ్డిదారిన ఎరువులు విక్రయించుకొనేందుకు ఎరువులు లేవంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

తనిఖీల్లో పట్టుబడుతున్న అక్రమ నిల్వలు

జిల్లాలో యూరియా పక్కదారిపై నిఘా కొనసాగించాలని ప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో గత కొద్ది రోజులుగా జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు ఉమ్మడి ఆధ్వర్యంలో ప్రత్యేక విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 ప్రకారం ఇప్పటికే 175 ప్రైవేటు డీలర్ల గోదాములు, దుకాణాల్లో 698 ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 66.24 మెట్రిక్ టన్నుల యూరియాను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా అక్రమాలకు పాల్పడిన ఐదుగురిపై 6ఏ కేసులు, ఏడుగురుపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు.

కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు



రైతులను మోసం చేసి యూరియా కృత్రిమ కొరత సృష్టించేవారిపై నిఘా కొనసాగుతోంది. అటువంటి చర్యలకు పాల్పడేవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపశమనం ఉండదు. ఎవరైనా ఎరువులను దాచిపెట్టినట్టు రుజువైతే క్రిమినల్ కేసులు తప్పవు. రైతులు ఎక్కడైనా యూరియా కృత్రిమ కొరత ఉన్నట్టు గమనిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- కె.విజయకృష్ణన్, కలెక్టర్, అనకాపల్లి



మత్స్యకారుల ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేసే వరకూ పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నక్కపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, పర్యావరణానికి, సముద్రానికి హాని కల్గించే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం మత్స్యకారుల నిరసన శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు భుజం కాస్తూ, ప్రజలను, ప్రకృతిని నాశనం చేసేందుకు పూనుకోవడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, సీపీఎం నేత ఎం.అప్పలరాజు మత్స్యకార నాయకులు ఎరుపల్లి నాగేశ్, తదితరులు పాల్గొన్నారు,

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

మాకవరపాలెం: ప్రజల సొమ్ముతో ప్రైవేటువారి పెత్తనం చేయడం ఏమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. శుక్రవారం భీమబోయినపాలెం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలన్నారు. మెడికల్ కాలేజీ పనులను రూ.500 కోట్లతో చేపట్టారని, ఇప్పటికే 50 శాతం పూర్తి చేశారన్నారు. మిగిలిన నిర్మాణ పనులను పీపీపీకి అప్పగించడం సరికాదన్నారు.

సచివాలయాల్లో అందని సేవలు

పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు

25 సచివాలయాల్లో 200కి 146 మంది ఉద్యోగులు

- 25 డిజిటల్ అసిస్టెంట్లకు ఉన్నవారు ఏడుగురు
- మండలం నుంచి 75 మంది బదిలీకాగా వచ్చినవారు 55 మంది మాత్రమే
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- పనులు కాకపోవడంతో ప్రజల ఇబ్బందులు



పాయకరావుపేట మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సచివాలయం

పాయకరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని గ్రామ సచివాలయాలు ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. పలు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. ఆపై ఉద్యోగుల కొరత వేధిస్తున్నది. స్టేషనరీ లేక విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు.**



పాల్తేరు సచివాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల కుర్చీలు

గ్రామ సచివాలయాల్లో ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. మండలంలో 30వేల జనాభా ఉన్న పాయకరావుపేట పట్టణంలో ఐదు సచివాలయాలు.. మిగిలిన 23 పంచాయతీల్లో 20 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి 8 నుంచి 11 మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. అయితే సచివాలయ వ్యవస్థ వచ్చి నాలుగేళ్లు కావస్తుండడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు సరిగా పని చేయడం లేదు. కొన్నిచోట్ల ప్రింటర్లు మరమ్మతులతో మూలకు చేరాయి. అవసరమైన పేపరు, ధ్రువపత్రాల జారీకి ప్రింటెడ్ స్టేషనరీ కొరత తీవ్రంగా ఉంది. దీనికితోడు సచివాలయాల ప్రక్షాళన

... మిగతా 8వ పేజీలో



పట్టణంలో మూతపడనున్న నాగరాజుపేట రైల్వే గేటు

పేటకు రెండో ఫ్లైఓవర్

నాగరాజుపేట రైల్వే గేటు స్థానే మరొకటి

- నాగరాజుపేట, లింగాలతోట కాలనీల మధ్య ఏర్పాటు
- ఇప్పటికే జాతీయ రహదారిపై ఒక ఫ్లైఓవర్
- తీరనున్న ట్రాఫిక్ సమస్య



పట్టణంలో ఫ్లైఓవర్ ప్రారంభం కానున్న ప్రదేశం

పాయకరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): **అత్యంత వేగంగా ప్రయాణించే రైళ్లను ప్రవేశ పెట్టేందుకు రైల్వే శాఖ జనావాసాలు ఉండే ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పాయకరావుపేట పట్టణంలోని నాగరాజుపేట రైల్వే గేటు స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించనుంది. కొత్తగా ఫ్లైఓవర్‌తోపాటు రక్షణ గోడలను రూ.100 కోట్లతో నిర్మించనున్నారు. దీంతో రైల్వే గేట్ల వద్ద వాహనదారుల నిరీక్షణకు తెరపడనుంది. ఇప్పటికే పట్టణంలో జాతీయ రహదారిపై రైలు పట్టాలు క్రాస్ అయ్యేచోట ఒక ఫ్లైఓవర్ ఉంది.**

రైల్వే ప్రమాదాల నివారణ, పటిష్ట రక్షణ చర్యల్లో భాగంగా పలు రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలను అభివృద్ధి చేస్తుండడంతో పాటు నివాస ప్రాంతాల్లో ఉన్న రైల్వే గేట్ల స్థానంలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలోని పీఎల్.పురం, నామవరం వద్ద రైల్వే గేట్ల స్థానే అండ్‌పాస్‌లు ఏర్పాటు చేసింది. తాజాగా పాయకరావుపేట పట్టణ పరిధిలో ఉన్న రెండు రైల్వే గేట్ల స్థానంలో ఫ్లైఓవర్, అండర్‌పాస్ ఏర్పాటుకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నిధులతో పట్టణంలోని తాండవ వంతెనను ఆనుకుని నాగరాజుపేట రైల్వే గేటు మీదుగా లింగాలతోట కాలనీలోని జాతీయ రహదారి(బైపాస్ రోడ్డు) దగ్గర వరకు 700 మీటర్ల పొడవు, ఎనిమిది మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం, వంతెనకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నాగరాజుపేట నుంచి జాతీయ రహదారి వరకు తాండవ నదికి రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా శివారులోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయనున్నారు. తాండవ నదిపై ఉన్న రైల్వే వంతెన నుంచి పట్టణ శివారు

... మిగతా 8వ పేజీలో

నత్తనడకన సబ్ ట్రెజరీ కార్యాలయ పనులు

వందేళ్ల నాటి భవనంలో ఉప ఖజానా నిర్వహణ

- వర్షం వస్తే కారుతున్న భవనం
- రికార్డులకు రక్షణ లేక ఇబ్బందులు
- కొత్త భవనం కోసం 2022లో రూ.75లక్షలు మంజూరు
- బిల్లులు మంజూరు కాక నేటికీ పూర్తి కాని నిర్మాణం

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): **నర్సీపట్నం ఉప ఖజానా కార్యాలయ నూతన భవన నిర్మాణం నత్తనడకన సా..గుతోంది. కాంట్రాక్టర్ పని చేసిన ప్రాప్తికి బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణంలో జాప్యమవుతోంది. దీంతో కార్యాలయంలో రికార్డులకు రక్షణ లేకుండా పోయింది. అధికారులు పని చేసుకోవడానికి సరైన ఫర్నిచర్ లేదు. సకాలంలో పూర్తి కాకపోవడంతో శిథిల భవనంలో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు.**



అసంపూర్తిగా ఉన్న నూతన భవనం

నర్సీపట్నం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బ్రిటీష్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన భవనంలో సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. వర్షం పడిందంటే కార్యాలయంలోని నీరు కారకుండా ప్లాస్టిక్ కవర్లు కట్టుకొని పనిచేసుకుంటున్నారు. శ్లాబ్ పాడవ్వడంతో భవనం పైకప్పు నుంచి వర్షం నీరు కారిపోయి గచ్చులు మడుగులా తయారు అవుతున్నాయి. తడికి చెక్క బీరువాలు చెదపట్టి పాడయ్యాయి. బీరువాలలోని పాత దస్త్రాలకు చెద పడుతున్నాయి. అధికారులు పని చేసుకోవడానికి సరైన సౌకర్యాలు లేవు. ఫర్నిచర్ కూడా పాతకాలం నాటివే వాడుతున్నారు. కార్యాలయం దుమ్ము, దూళితో నిండి ఉంది. సీలింగ్ రాలి పోతోంది. సబ్ ట్రెజరీ అధికారి గది వర్షానికి కారిపోతుండడంతో చిన్న జాగాని ఆఫీసు రూమ్‌గా మార్చుకొని పనిచేసుకుంటున్నారు.

సా...గుతున్న నిర్మాణ పనులు

సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో కేటాయించారు. గత వైసీపీ ప్రభుత్వం 2022లో నర్సీపట్నం, కోటవురట్ల సబ్ ట్రెజరీ కార్యాలయాలకు రూ.75లక్షలు చొప్పున మంజూరు చేసింది. ఏడాది తర్వాత టెండర్లు ప్రక్రియ చేపట్టింది. గత ఏడాది ఏప్రిల్‌లో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించి, పునాదులు, పిల్లర్లు వరకు

... మిగతా 8వ పేజీలో



అధ్వానంగా ఉన్న ప్రాంతంలో పనిచేస్తున్న ఎస్‌టీవో

బీఎన్ రోడ్డు మరమ్మతులు ఇక చేయలేం

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ముందే చేతులెత్తేసిన కాంట్రాక్టర్

- బిల్లులు చెల్లిస్తేగానీ పనులు చేయలేమని స్పష్టీకరణ
- గుంతలు పూడ్చలేకుంటే పనులు వదిలి వెళ్లిపోండంటూ సీఈ ఆగ్రహం
- మీ డబ్బు వస్తుంది.. ముందు పనులు చేయండని మందలింపు



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డు గోతుల దుస్థితిని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ

రావికమతం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లిస్తేనే గానీ బీఎన్ రోడ్డు మరమ్మతులు కూడా ఇకపై చేయలేమని రోడ్ల, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ వీకె. విజయశ్రీ వద్ద కాంట్రాక్టర్ ఖరాఖండిగా చెప్పేశారు. ఎన్‌డీపీ నిధులతో జిల్లాలో ఆర్అంబీ రోడ్లను పరిశీలించేందుకు శుక్రవారం ఆమె ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని గర్నికం, మేడివాడ, దొండపూడి, కొత్తకోట తదితర గ్రామాలలో బీఎన్ రోడ్డుపై ఏర్పడిన చెరువును తలపించేలా ఉన్న భారీ గోతులను ఆమెకు టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు, టీడీపీ నేతలు రాజాన కొండనాయుడు, గొర్లె సాంబశివ, వజ్రపు వెంకట నర్సింహామూర్తి, గోకివాడ రమణ తదితరులు చూపించారు. ఈ గుంతల వల్ల కనీసం రాకపోకలకు కూడా సాధ్యం కావడం లేదన్నారు. వీటిలో వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారని చీఫ్ ఇంజనీరుకు వివరించారు. అలాగే

... మిగతా 8వ పేజీలో

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

ఎయిరిండియా ఘటనపై సర్వత్రా ఆందోళన

- విమానాశ్రయ పరిసరాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- పక్షుల సంచారానికి అదే కారణం
- ఇటీవల సమావేశంలో హెచ్చరించిన కలెక్టర్
- స్పందించని అధికారులు
- ఎయిర్‌పోర్టులోనే ఎయిరిండియా విమానం
- మరమ్మతులు చేస్తున్న సాంకేతిక నిపుణులు



పక్షి ఢీకొనడంతో వెనక్కి వచ్చిన విమానం(ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని గురువారం పక్షి ఢీకొన్న ఘటనపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతోనే పెనుప్రమాదం తప్పిందని చెబుతున్నారు. విమానాశ్రయ పరిసరాల్లో పక్షుల సంచారానికి ప్రధాన కారణం పారిశుధ్య చర్యలు సవ్యంగా చేపట్టకపోవడమేనని భావిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పారిశుధ్యం సమస్యనే ప్రధానంగా ప్రస్తావించినప్పటికీ యంత్రాంగం సత్వరం

... మిగతా 8వ పేజీలో


నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ కృష్ణన్

నిర్వాసితులతో కలెక్టర్ సమావేశం

నక్కపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిర్వాసిత రైతులతో కలెక్టర్ విజయ్ కృష్ణన్ తన కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. పెదబోదిగల్లంలో నిర్మిస్తున్న నిర్వాసిత కాలనీకి సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడారు. అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తే పునరావాస కాలనీకి రావడానికి సిద్ధమేనని కొందరు నిర్వాసిత రైతులు చెప్పారు. కాలనీలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తాగునీరు, విద్యుత్ వెంటనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వీవీ రమణ, తహశీల్దార్ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో విద్యుత్ స్తంభాల మార్పిడిలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు భోగాపురం రోడ్డు, ఎస్‌టీబీఎల్ కాలనీ, ఎలమంచిలి రోడ్డు, గాజువాక రోడ్డు, అనకాపల్లి రోడ్డు, పూడిమడక రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాల పక్కన చెత్త


రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

రాంబిల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకివాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. గ్రామస్తులు ఇళ్లలోని వ్యర్థాలను తీసుకువచ్చి పాఠశాల సమీపంలోని రోడ్డు పక్కన వేస్తుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు అక్కడే మూత్ర మల విసర్జన చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చీమలాపల్లి ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆస్పత్రిని సందర్శించి ఎన్‌కేఏఎస్ బృందం

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :చీమలాపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం శుక్రవారం సందర్శించింది. కేంద్రంలో రికార్డులు, మందులు, పరికరాలు, రోగులకు అందుతున్న సేవలు, ఎస్సీడీసీ సర్వే, క్లినిక్ నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షకీనజాయ్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎన్.మణికంఠ, ఆరోగ్య విస్తరణాధికారి ఎన్. శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్, గాయత్రి, జ్యోతి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత వాడ్రాపల్లి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పెంటకోట విజయ్

మునగపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మునగపాకలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో వాడ్రాపల్లి జట్టు విజేతగా నిలిచింది. గురువారం అర్ధరాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి.రెండో బహుమతి జంపాలెం, మూడో బహుమతి సోమలింగపాలెం, నాలుగో బహుమతి మడకపాలెం, ఐదో బహుమతి మునగపాక జట్లు సొంతం చేసుకున్నాయి. విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలు జూనియర్ హైటెక్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి.

వ్యవసాయ పనిముట్లు చోరీపై ఫిర్యాదు


పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మునగపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మునగపాకలో రెండు మూడు రోజులుగా వ్యవసాయ పనిముట్లు చోరీకి గురవుతున్నాయి. ఈమేరకు రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంజనేయ రైతు మూల సంఘం ఆడారి దానయ్య కల్లాల వద్ద పది మంది రైతుల పశువుల పాకలో ఉన్న కత్తి, కొడవలి, గునపాం, పారతో పాటు పలు రకాల పనిముట్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. మెయిన్ రోడ్డు ఐదు మదాలు వద్ద కూడా పనిముట్లు పోయినట్లు రైతులు చెబుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు ఆడారి సాంబశివ, బుద్ధ గోవింద, ఆడారి గోవింద అప్పారావు, బీశెట్టి సూరి అప్పారావు, ఆడారి సూరిబాబు ఉన్నారు.


కొండలదేవునిపాలెం నుంచి వెంకయ్యపాలెం వెళ్లే రోడ్డులో తుప్పలు


గజిరెడ్డిపాలెం నుంచి లోవపాలెం వెళ్లే రోడ్డులో దుస్థితి

తుప్పలు.. తిప్పలు

- రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పొదలు
- మలుపుల వద్ద పరిస్థితి దారుణం
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు

రాంబిల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోయాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాంబిల్లి నుంచి కొండలదేవునిపాలెం మీదుగా వెంకయ్యపాలెం వెళ్లే రోడ్డు, కొండవారపాలెం నుంచి గజిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డు, గజిరెడ్డిపాలెం నుంచి లోవపాలెం వెళ్లే రోడ్డు, సంతపాలెం నుంచి వెల్చూరు వెళ్లే రోడ్డులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇరువైపులా దట్టమైన ముళ్ల పొదలు, తుప్పలు పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఈ రోడ్లలో నిత్యం రాకపోకలు సాగించే


కొండవారపాలెం నుంచి గజిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డుకి ఇరువైపులా తుప్పలు

వారు ఇబ్బందులు పడుతున్నారు. అసలే రోడ్లు ఇరుకు, పైగా తుప్పలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పగటి పూట ఎలా ఉన్నా.. రాత్రి వేళ నరక యాతన అనుభవిస్తున్నారు. తుప్పల వల్ల పాములు రోడ్లపైకి వస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి తుప్పలను తొలగించడంతో పాటు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతుల చెంతకే సొసైటీ సేవలు

- నక్కపల్లి సొసైటీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి



రుణాల గురించి అవగాహన కల్పిస్తున్న కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు సహకార సంఘాల వద్దకు వెళ్లి, రుణాల కోసం పడిగాపులు పడడం, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకుని మీ వద్దకే - మీ సొసైటీ అన్న కార్యక్రమానికి నక్కపల్లి సొసైటీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఉపమాక గ్రామంలో సొసైటీ పరిధిలోని రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు తక్కువ వడ్డీకి పంట రుణాలు, గృహ నిర్మాణ రుణాలు అందిస్తామని చెప్పారు. ఇందుకు సొసైటీలో ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు.ఎకరాకి రూ.5 లక్షలు, శ్లాబ్ పూర్తయిన ఇంటికి వాయిదాల పద్ధతిలో చెల్లించేలా తక్కువ వడ్డీలకు రుణాలిస్తామని తెలిపారు. రైతులు పలుమార్లు సొసైటీకి తిరగకుండా అన్ని పత్రాలు సమర్పించిన వెంటనే రుణాలు మంజూరు చేస్తామన్నారు. సొసైటీ పరిధిలో వున్న అన్ని గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, సొసైటీ అధికారులు ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో పాలకులు విద్యా రంగ సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అర్రిల్లి జగదీశ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు శుక్రవారం పాయకరావుపేటలోని వంగవీటి మోహనరంగ విగ్రహం వద్ద విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, జీఓ నం.107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పాయకరావుపేట నియోజకవర్గ నాయకులు నవీన్, రాజు, సింహాద్రి, పవన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్


ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న దస్తావేజు లేఖరులు

ఎలమంచిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు (డాక్యుమెంట్ రైటర్లు) శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర నాయ కుల పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. శనివారం కూడా పెన్‌డౌన్ కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు ఎస్. నాగరాజు, శేషు, పి. నాగేశ్వరరావు, ఎస్. సూర్యప్రకాశరావు, సేనాపతి రాము పాల్గొన్నారు.

కోటవురట్ల, నక్కపల్లి మండలాల్లో...

కోటవురట్ల : కోటవురట్లలో కూడా దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు లాలం గోవింద, ప్రధాన కార్యదర్శి గొల్లు రాజులనాయుడు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్-2.0 సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలు, ఆన్‌లైన్‌లో దస్తావేజుల ఎడిటింగ్ ఆప్షన్ రద్దు, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు.

నక్కపల్లి : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని రద్దు చేయాలని మండల దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు డి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపుమేరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఎం నేత అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ నరసింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘ ప్రతినిధులు ఎన్. రమణ, జి. నూకరాజు, బి. రాజు, కె. సూర్యనారాయణ, వి. లోకేశ్, చౌదరి, ఉపేంద్ర, గోవింద్, రమేశ్, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

మునగపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి యూపీ పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపా ధ్యాయులు రాణి, నానాజీ, సీఆర్పీ అచ్యుతకృష్ణను మా ఊళ్లో గ్రంథాలయం సంస్థ శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు జామంటరీ బాక్స్‌లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు బోధనకు ఒక విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్ మూర్తి, బీశెట్టి రామలక్ష్మి, బీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, హెచ్‌ఎం రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి యువకుడి మృతి


మృతి చెందిన దివాకర్

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా శుక్రవారం రాత్రి బైక్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన బొడ్డే దివాకర్ (36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం ఉదయం బైక్‌పై పట్టణానికి వచ్చి రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, ఉన్నత పాఠశాల వద్ద ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడ్డాడు. ఈ సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ముందు వెళుతున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పురుషోత్తం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'తో ఆరోగ్య భద్రత

కోటవురట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించారని వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ పేర్కొన్నారు. శుక్రవారం బోడపాలెం సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. మహిళలకు, బాలికలకు రక్తహీనత, నోటి క్యాన్సర్, క్షయ, సికిల్‌సెల్, అనీమియా, బీపీ, మధుమేహం వంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం 160 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో...

ఎస్. రాయవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్. వాసంతి తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎస్. రాయవరం సచివాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అంతకముందు శిబిరంలో పాల్గొన్న మహిళలకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మీనాకుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

మునగపాక : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా పలు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. మెలుపాకలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయభాస్కరరాజు, నాయకులు కె. వీరరాజశేఖర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ రాయవరంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన మహిళలు


బోడపాలెం వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి సుమ


మంత్రి శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మంత్రి కొండపల్లిని కలిసిన ప్రగడ

ఎలమంచిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అచ్యుతాపురంలో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులో యువ పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు. ఈమేరకు ప్రగడ ఒక ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ నాయకుల సమావేశం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెలలో జరిగే ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆర్ఎస్ఎస్ ఉత్సవాల నిర్వహణపై నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజా రంజక పాలనతో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ప్రజల మధ్య ఉంటూ వారితో మమేకం కావాలన్నారు. అనంతరం ఉత్సవాల కార్యాచరణ గురించి చర్చించారు. సమావేశంలో బీజేపీ నాయకులు హరి, సుందరపు బాబ్జీ, నక్కా శివశంకర్, పప్పు ఈశ్వరరావు, మళ్ల కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుంటపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ


కార్డులు పంపిణీ చేస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటపల్లి గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన తెల్ల రేషన్‌కార్డుదారులకు 852 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నామవరం పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కన్నబాబు, పంచాయతీ ఉప సర్పంచ్ కరెడ్ల దొరబాబు, పంచాయతీ కార్యదర్శి సునీత, కూటమి నాయకులు కక్కల శ్రీను, పల్లి దుర్గారావు, సచివాలయం ఉద్యోగి కృపారావు, వీఆర్పీ నాగేశ్వరరావు, రేషన్ డీలర్ దమ్ము సత్యనారాయణ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

మునగపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలానికి రూ. 1.11 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో ఎం. ఉషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్‌కు రూ. 25 లక్షలు మంజూరు కాగా వాటిని టైడ్, అన్‌టైడ్‌గా వినియోగించనున్నట్టు చెప్పారు. ఈ నిధులతో తాగునీరు, శానిటేషన్ పనులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈవోఆర్డీ సోమరాజు మాట్లాడుతూ మండలంలోని 26 పంచాయతీలకు రూ. 86.86 లక్షలకు పైగా 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని చెప్పారు.నిధులను పంచాయతీల ఖాతాలకు జమ చేశామని తెలిపారు.మునగపాక పంచాయతీకి రూ. 13 లక్షలు, నాగులాపల్లికి రూ.9.34లక్షలు, అరబుపాలెంనకు రూ. 3 లక్షలు, చెర్లోపాలెంనకు రూ.2.36 లక్షలు, చూచుకొండకు రూ.3.82 లక్షలు, గణపర్తికి రూ.3.31 లక్షలు, గంటవానిపాలెంనకు రూ.1.34 లక్షలు, గొల్లలపాలెంనకు రూ.1.62 లక్షలు, కాకరాపల్లికి రూ.1.39 లక్షలు, మడకపాలెంనకు రూ.1.13 లక్షలు, మళ్లవరంనకు రూ.1.58 లక్షలు, మెలిపాకకు రూ.3.86 లక్షలు, మూలపేటకు రూ. 2.29 లక్షలు, నాగవరంనకు రూ.3.38 లక్షలు, నారాయుడుపాలెంనకు రూ.2.57 లక్షలు, పి. ఆనందపురంనకు రూ.2.68 లక్షలు, పాటిపల్లికి రూ.2.76 లక్షలు, రాజుపేటకు రూ.1.16 లక్షలు, రామగిరికి రూ.71 వేలు, టి. సిరసపల్లికి రూ.3.52 లక్షలు, తిమ్మరాజుపేటకు రూ.5.81 లక్షలు, తోటాడకు రూ.3.26 లక్షలు, ఉమ్మలాడకు రూ. 3.67 లక్షలు, వాడ్రాపల్లికి రూ.2.23 లక్షలు, వెంకటాపురంనకు రూ.2.16లక్షలు, ఒంపోలుకు రూ.4.63 లక్షలు మంజూరయ్యాయని ఆయన వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


దోసూరులో గర్భిణిలకు సామూహిక సీమంతాలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అచ్యుతాపురం వైద్యాధికారి లిఖిత అన్నారు. శుక్రవారం దోసూరులో గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె స్థూల కాయం, బాల్య దశ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి : గర్భిణిలు, బాలింతలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి. రమా చెప్పారు. శుక్రవారం పట్టణంలోని సీపీ పేట అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణిలకు సీమంతాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు ఉపాధ్యాయులు మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలకు ఆరోగ్యపరమైన సూచనలు అందించారు.

జగనన్న కాలనీలో సమస్యల తిష్ఠ

పరవాడ జగనన్న కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. తహశీల్దార్ కార్యాలయానికి ఎదురుగా కాలనీ ఏర్పాటై రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలు కరువయ్యాయి. రహదారులు నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువలు లేకపోవడంతో ఇళ్ల మధ్యలో మురుగు నీరు ఏరులై పారుతోంది. ఫలితంగా కాలనీ వాసులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

- కానరాని రహదారులు.. కాలువలు
- ఇళ్ల మధ్యే మురుగు నీటి ప్రవాహం
- ఆవాసానికి కాలనీ వాసుల అగచాట్లు
- రెండున్నరేళ్లుగా వినతులు అందిస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ముళ్ల పొదలు, పిచ్చి మొక్కల మధ్య ఉన్న కాలనీ



కాలనీలో కానరాని రహదారులు

పరవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ కాలనీలో సుమారు 60 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నాయి. వసతులను సమకూర్చడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీని కారణంగా కాలనీ వాసులు అవస్థలు నడుమ కాలం వెల్లదీస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు కాలువల నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో వాడుక నీరంతా ఇళ్ల మధ్యే ఉండిపోతున్నది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రులు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. అలాగే వీటి కారణంగా పలువురు జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. వీధి రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాళ్లపై నుంచి నడవలేని పరిస్థితి దాపురించింది. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. వీధి రోడ్ల నిర్మాణంతో పాటు మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విష పురుగుల సంచారం అధికమైంది. చీకటి పడితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటే కాలనీ వాసులు హడలిపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి కాలనీలో వీధి రోడ్లు, కాలువలు నిర్మించాలని వారు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యే పారుతున్న మురుగు నీరు

నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి: ఎమ్మెల్యే కొణతాల



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం కోరారు. కోట్లాది రూపాయలు భూమి ధరలు పెరుగుతున్నప్పటికీ కనీసం భూమి కోల్పోయిన రైతులకు ఒక ఉద్యోగం కూడా పరిశ్రమ యజమాన్యాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కనీసం పరిశ్రమల్లో అటెండర్ ఉద్యోగం కూడా లేదన్నారు. దీనికి నిర్దిష్టమైన విధి విధానాలు అవసరమన్నారు. సుమారు 20 నుంచి 50వేల ఎకరాలు పరిశ్రమలు తీసుకున్నప్పటికీ ఎటువంటి నిర్మాణం చేపట్టలేదని, ఇటువంటి వారిపై పరిశ్రమ విధివిధానాలను అమలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి టీజీ భరత్ వివరణ ఇచ్చారు. పరిశ్రమల ద్వారానే ఆయా ప్రాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి, శిక్షణ కల్పించి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ

అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా



బవులవాడలో బీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

తుమ్మపాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందిన బవులవాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గొల్లవిల్లి అప్పారావు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు నమూనాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. కార్యకర్తల ప్రతీ కష్టంలో పార్టీ అండగా నిలుస్తోందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని ప్రశంసించారు. అలాగే పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో వినతిపత్రాలను స్వీకరించారు. గ్రామాల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బవులవాడ ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు మళ్ల సురేంద్ర, సబ్బవరపు గణేశ్, చెక్కల శ్రీను, కోట్ని ఈశ్వరరావు, బత్తుల రమేశ్, పరమేశ్వరరావు, చొప్పా రమణ, సత్యనారాయణ, అమరావతి, నరసింగరావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు ప్రత్యేక వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వాహనాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు, తదుపరి చికిత్స నిమిత్తం సంబంధిత వైద్యాధికారుల సూచన మేరకు ఆసుపత్రులకు తీసుకువెళ్లేందుకు ఈ వాహనాన్ని వినియోగిస్తారని ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్య సలహా, చికిత్స పూర్తిగా ఉచితంగా చేయడానికి, వారి రవాణా కోసం ఈ వాహనాన్ని సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు కేవీ జ్యోతి, చంద్రశేఖరదేవ్, జె.ప్రశాంతి, ఎస్తేరురాణి పాల్గొన్నారు.


ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, కోచ్‌లు

పరవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలోని ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 విభాగంలో కుస్తీ, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్, గట్కా, థాంగ్-థా పోటీలను, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో మోడరన్ పెంటాథ్లాన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక చేసినట్టు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, శేషు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శరగడం మహలక్ష్మినాయుడు, ఉమాలక్ష్మి, కుటుంబ సభ్యులు ఊంజల్‌సేవ నిర్వహించారు. పలు మహిళా మండళ్లు ఆలపించిన భక్తి గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అనకాపల్లి పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా కె.రాంబాబు, ఎస్.వి.పద్మావతి, అధ్యక్షుడిగా టి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనుబాబు, ఆర్థిక కార్యదర్శిగా ఎం.వి.నూకేశ్‌ను ఎన్నుకున్నారు. అలాగే మహిళా అధ్యక్షురాలుగా ఎం.ఉమామహేశ్వరి, ఉపాధ్యక్షురాలుగా ఎస్.టి.బి.పి.దేవి, అసోసియేట్ అధ్యక్షులుగా పి.ఎన్.వి. సత్యనారాయణ, ఎం.ఉమామహేశ్వరరావు, జె.రమేశ్, పి.రమాదేవి, ఉపాధ్యక్షులుగా కె.రాంప్రసాద్, బి.మంగపతి, ఎ.ఈశ్వరరావు, జి.తులసిలక్ష్మి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఎస్.వెంకట్రావు, జి.చక్రవర్తి, ఎస్.అనసూయ, ఎం.సుశీల, జిల్లా కౌన్సిలర్లుగా కె.గోవింద, కృష్ణమోహన్, సిహెచ్ లక్ష్మణ్, ఎన్.రమాదేవి ఎన్నికయ్యారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న జగదీశ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు చెప్పారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి శుక్రవారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద గల అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యూలో ఉన్న వారికి భోజనాలు వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలోని లక్షలాది మంది ఈ క్యాంటీన్లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి రుచికర భోజనాలు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి పాలనలో అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదలకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, బి.వెంకటరావు, కె.సత్యనారాయణ, మళ్ల గణేశ్, కె.మల్లేశ్వరరావు, ఎస్.గణపతి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెన్‌డౌన్



సబ్బవరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరుల నిరసన

కొత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. కొత్తూరు కూడలిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, కార్డు ప్రైం సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతుందని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం కూడా పెన్‌డౌన్ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

సబ్బవరంలో...

సబ్బవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం రద్దు చేయాలని స్థానిక దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజు సంఘం అధ్యక్షుడు వల్లభజోష్యల సీతారామమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త విధానాలు ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ కారణంగా ప్రక్రియలో జాప్యం జరుగుతుందన్నారు. దీనివల్ల అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేఖరుల సమయం వృథా అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ తక్షణమే స్పందించి కొత్త విధానంలో మార్పులు చేయాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ జిలానీ బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జూరెడ్డి శ్రీరామమూర్తి, శేఖరమంత్రి శ్రీనివాసరావు, దంతులూరి సురేశ్‌వర్మ, నరవ రామచంద్రరరావు, గొంప చంద్రశేఖర్, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పట్టించుకోవాలి

యూటీఎఫ్ రణభేరి ముగింపు సభలో రెడ్డి మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి మోహనరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి ముగింపు సభ శుక్రవారం ఉదయం సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండో ఏడాదిలో అడుగుపెట్టినా ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను అనుసరించి 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యల పై స్పందించకపోతే ఈ నెల 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయి, గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు గ్రామ స్థాయి కమిటీలు

కశింకోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణకు గ్రామ స్థాయి రక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని జిల్లా బాలల సంరక్షణ విభాగం సలహాదారులు ఎం.డి.గౌసియా భాను చెప్పారు. జి.భీమవరం సచివాలయంలో శుక్రవారం ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవో నంబరు-1 ప్రకారం ప్రతీ గ్రామంలో బాలల సంరక్షణ, రక్షణ కమిటీలను ఏర్పాటయ్యాయన్నారు. పిల్లలకు ఎటువంటి సమస్యలు ఉన్నా గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాలని, ఈ బాధ్యతలను కమిటీలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సర్పంచ్ లక్ష్మణరావు, మహిళా పోలీసు ఝాన్సీ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు చర్చించాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జీజీ ఫణీంద్రకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రతినిధులు ఎ.జగదీశ్, సింహాద్రి, రాజు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఉపాధ్యాయున్ని సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో శుక్రవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీవీఎం నాగజ్యోతిని ఘనంగా సత్కరించారు. పొట్టి శ్రీరాములు భవనం 24వ వార్షికోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు మేనల్లుడు గనుపూడి సత్యనారాయణ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవనం నిర్మాత పిరాట్ల నరసింహం, బీజేపీ సీనియర్ నాయకులు గంగుపాం నాగేశ్వరరావు, భోగలింగేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, జి.లావణ్య, కాండ్రేగుల దుర్గాప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ఉద్యోగుల రిలే దీక్షలు



దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు రిలే దీక్షలు చేపట్టారు. పెనుభారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎనర్జీ అసిస్టెంట్‌లకు పాత సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని నినాదాలు చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్, పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పెండింగ్ పెట్టిన నాలుగు వాయిదాల కరువు భత్యాన్ని విడుదల చేయాలని జేఏసీ చైర్మన్ వీఎస్ఆర్‌కె గణపతి డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షల్లో 1104 యూనియన్ అధ్యక్షులు అనకాపల్లి నూకరాజు, కుంచుబాబు, పేరపు రాంబాబులతో పాటు మహిళా ఉద్యోగులు పాల్గొని దీక్ష చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై జీవీఎంసీ అధికారులు రెండో రోజు శుక్రవారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. నెహ్రూచౌక్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఉమ్మలాడ జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. కొన్నిచోట్ల బడ్డీలను తీసివేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, టీపీవో వరప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను నియమించాలని ధర్నా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లికి పూర్తి స్థాయి తహశీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. రాజకీయ నాయకుల ఒత్తిడితో ఇక్కడ తహశీల్దార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నదని ఈ సందర్భంగా కృష్ణ చెప్పారు. ఇన్‌చార్జి తహశీల్దార్ శాంతిభూషణరావు స్థానంలో పూర్తిస్థాయి తహశీల్దార్‌ను నియమించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆయన కోరారు. ఈ ధర్నాలో పార్టీ నేత నూకరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పరవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదముషిడివాడ పంచాయతీలో సర్పంచ్ పల్లా నాగమణి శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆమె చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లా అప్పారావు, వై.బుజ్జి, పల్లా వెంకటలక్ష్మి, శీర పైడమ్మ, కలవలపల్లి సత్యనారాయణ, బి.వెంకునాయుడు, పల్లా వెంకునాయుడు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు పూర్తిచేయండి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దెబ్బతిన్న రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.

ఉమ్మలాడ రోడ్డులో తుప్పల తొలగింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పూడిమడక రోడ్డులోని ఆశీలమెట్ట జంక్షన్ నుంచి ఉమ్మలాడ మార్గంలో శుక్రవారం తుప్పలను తొలగించారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించడమే కాకుండా నివాసాలు ఉన్న వారు తుప్పలు పేరుకుపోవడం ఇబ్బందులు పడుతున్నారని, విష సర్పాల భయం కూడా ఉందని జీవీఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి పలువురు తీసుకువచ్చారు. దీనికి జడ్సీ చక్రవర్తి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఉద్యానవన అధికారిణి ప్రియాంక ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణికులకు ఇబ్బందుల తప్పాయి.

ఎగ్జిబిషన్ ఏర్పాట్లు నిలువరించాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌కు పక్కనే సర్వే నంబరు 813లో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ పనులను నిలుపుదల చేయించాలని సీపీఐ అనకాపల్లి జోనల్ సహాయ కార్యదర్శి వైఎన్ భద్రం కోరారు. ఈ మేరకు శుక్రవారం జోనల్ కమిషనర్‌ను వినతిపత్రం అందించారు. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం తగదన్నారు. కోట్ల విలువైన జీవీఎంసీ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ స్థల వివాదం కోర్టులో ఉన్నందున ఎగ్జిబిషన్ ఏర్పాట్లను నివారించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ నాయకులు కోరిబిల్లి శంకరరావు, కరణం మాణిక్యాలరావు, మత్తుర్తి సూరిబాబు ఉన్నారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

కొత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా జూనియర్ కళాశాలల విద్యార్థులకు అథ్లెటిక్ పోటీలు, జట్ల ఎంపికలు శనివారం జరగనున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో దాదాపు 200 మంది విద్యార్థులు వివిధ కళాశాలల నుంచి పాల్గొంటారని తెలిపారు. పోటీలను కళాశాల యాజమాన్యం అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

గొల్లవీధిలో వైద్య శిబిరం

కొత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని గొల్లవీధిలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింగ్ యాదవ్, నాయకులు జీవీ.సత్యనారాయణ, ఈశ్వర్, పుడా రమేశ్, శేషు, భానుమతి పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ

సీలేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిగిరిబాబు మాట్లాడుతూ.. దుప్పులవాడ పంచాయతీ పరిధిలో 3.4 టన్నుల రాజ్‌మా విత్తనాలను ఒక్కొక్కరికి 10 కిలోల బ్యాగ్ చొప్పున 304 మంది రైతులకు సరఫరా చేసినట్టు చెప్పారు. విత్తనాలు అందని వారు తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ ఉల్లాస్ కూటమి నాయకులు టొక్కుబాబు పాల్గొన్నారు.

అందుబాటులో హోమియోపతి వైద్య సేవలు


మాట్లాడుతున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్

చింతపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు హోమియోపతి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల క్రితం తాజంగిలో ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ గదిలో హోమియో వైద్యసేవలందిస్తున్నామన్నారు. మైదాన ప్రాంత ప్రజలు హోమియో వైద్యసేవలను వినియోగించుకుంటున్నారన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు అవగాహనలేక హోమియో వైద్యసేవలు పొందడంలేదన్నారు. వీరు కూడా హోమియోపతి సేవలను ఉప యోగించుకోవాలన్నారు.

రహదారి పనులు పరిశీలన


వలసగెడ్డ కొత్తూరు వద్ద రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ డేవిడ్ రాజు

సీలేరు, సెప్టెంబరు 19, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాతీయ పరిధిలోని మారుమూల గ్రామం మునసపల్లికి నిర్మిస్తున్న కనెక్టివిటీ రహదారి పనులను శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జికూటీవ్ ఇంజనీర్ డేవిడ్‌రాజు పరిశీలించారు. వలసగెడ్డకొత్తూరు వద్ద గల ఆర్ అండ్‌బీ రహదారి నుంచి వలసగెడ్డ, వలసపల్లి మీదుగా మునసపల్లికి ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారి నిర్మాణానికి రూ. 5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఈఈ పరిశీలన చేశారు. త్వరిత గతినపనులను పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీఆర్ ఆర్ నాయుడు, ఇంజనీ

బీజేపీ కార్యకర్త రాజ్‌కుమార్ మృతి తీరని లోటు


మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తునన బీజేపీ జిల్లా అధ్యక్షులు

చింతపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):లంబసింగి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త వాడకాని రాజ్‌కుమార్ మృతి తీరని లోటని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు. శుక్రవారం ఆమె మృతు కుటుంబాన్ని పరామర్శించి, ఆయన భౌతికకాయనికి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై వస్తున్న రాజ్‌కుమార్‌ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీసు అధికారులు దర్యాప్తు వేగవంతం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, సీనియర్ నాయకులు రామకృష్ణ, పెనుమాక రవికుమార్, ఈశ్వర్, కదుళ్లశ్రీనివాస్, వసుపరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా కిట్లంగి పెద్దబ్బాయి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా కిట్లంగి పెద్దబ్బాయి, ప్రధాన కార్యదర్శిగా పొడుగు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర కౌన్సెలర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని దుశ్చరపాలెం పాఠశాలలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మండల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్నా ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. అలాగే, మహిళా అధ్యక్షురాలుగా కంకిపాటి బాల గాంధీ ఎన్నికయ్యారన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల శ్రమదానం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):పెదవలస సంత పరిసరాలను స్థానిక ఏవోపీ ఏ234 బెటాలియన్ జవాన్లు శుభ్రం చేశారు. శుక్రవారం స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జవాన్లు దుకాణాలు, వీధులు శుభ్రం చేశారు. ఇన్‌స్పెక్టర్లు సురేంద్రకుమార్ నైర్, కుశలప్ప, ఏకే నాయక్, జవాన్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

» జీకేవీధిలో దుస్థితి

» అవస్థలు పడుతున్న ఆదివాసీలు


శుక్రవారం ఉదయం 11గంటలకు తాళం వేసివున్న జీకేవీధి సచివాలయం


కార్యాలయం బయట నిరీక్షిస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ గ్రామ సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడంతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల వరకు గ్రామ సచివాలయం తెరుచుకోలేదు. తలుపుకి తాళాలు వేసి ఉన్నాయి. అయితే, ఆటో మిత్ర, కులం, ఆదాయం ధ్రువపత్రాలు రిజిస్ట్రేషనకుఉదయం తొమ్మిది గంటలకు వచ్చిన ఆదివాసీలు సచివాలయం బయట కూర్చుని నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయం తెరుచుకుంది. కేవలం కార్యదర్శి ఒ క్కరే హాజయరయ్యారు. ఇతర ఉద్యోగులు ఎవరూ రాలేదు. ఉన్న తాధికారుల పర్యవేక్షణలేక పోవడం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. దీనిపై డీడీవో బాలకృష్ణ వివరణ కోరగా సమయపాలన పాటించని సచివాలయం ఉద్యోగులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

భీరంను జి.మాడుగులలోనే కొనసాగించాలని వినతి


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న పెసా కమిటీ ఉపాధ్యక్షులు

జి.మాడుగుల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాల పునర్విభజనలో భా గం గా భీరం పంచాయతీని ప్రస్తుత జి.మాడుగుల మండలంలోనే కొనసాగించాలని ఆ పంచాయతీ పెసా కమిటీ ఉపాధ్యక్షులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పాడేరు ఐటీడీఏ పీవో తిరుమని శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భీరం పంచాయతీ అన్ని గ్రామాలకు జి.మాడుగులకు సమీపంలో ఉ న్నందున పరిపాలన, అభివృద్ధి కార్యకలపాలకు సులువుగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.పోతురాజు, పెసా ఉపాధ్యక్షులు ఎస్.సింహాచలం, జి.చిన్నకృష్ణచారి, ఎం.మత్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన జీసీసీ అధికారులు


పీవో శ్రీపూజకు జీసీసీ ఉత్పత్తులుందజేస్తున్న డీఎం వెంకటేశ్, కృష్ణప్రసాద్

చింతపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధి గిరిజన సహకార సంస్థ అధికారులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమని శ్రీపూజను మర్యాదపూర్వకంగా కలిశారు. చింతపల్లి, పాడేరు డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్, కృష్ణప్రసాద్‌లు పీవో గిరిజన సహకార సంస్థ ద్వారా ఆదివాసీలకు అందిస్తున్న సేవలు, కాఫీ మార్కెటింగ్, అటవీ ఉత్పత్తులు కొనుగోలు వివరాలను తెలియజేశారు. ఈమేరకు గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు దళారీ వ్యవస్థ వల్ల నష్టపోకుండగా జీసీసీ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీవో తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రాంచి మేనేజర్లు చల్లంగి సుగునాథం, సరమండ విజయ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యల పరిష్కారంలో విఫలం: ఏఐఎస్‌ఎఫ్

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ వద్ద ధర్నా చేపట్టి అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.కృష్ణ, కె.రాజశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని, పీపీపీ విధానంలో 10 మెడికల్ కళాశాలలు కట్టబెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, శ్రీరామ్, భార్గవి, బాలు, సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని గ్రామ వలంటీర్ల ధర్నా

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే ఐటీడీఏ ముట్టడి చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. వలంటీర్ల డిమాండ్‌ల సాధనకు శుక్రవారం మోదకొండమ్మ ఆలయం నుంచి ఐటీడీఏ వరకు గ్రామ వలంటీర్లు భారీ ర్యాలీ చేపట్టి ఐటీడీఏ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి వాలంటీర్లకు బకాయి పడ్డ వేతనాలకు బడ్జెట్‌ను విడుదల చేయాలని, రోడ్డున పడ్డ వలంటీర్ల కుటుంబాలను ఆదుకోలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, సంఘ నాయకులు సత్యారావు వివిధ మండలాలకు చెందిన సుమారు 400 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు స్కూటీ దగ్ధం

జి.మాడుగుల, సెప్టెంబరు 19 (ఆంధ్రజోతి) : మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ గుర్రాయి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కుమారి ద్విచక్ర వాహనం పిడుగుపడి దగ్ధమైంది. వాహనాన్ని ఎప్పటిలాగే ఇంటి సమీపంలో గురువారం రాత్రి నిలిపి ఉంచారు. ఒక్కసారిగా వర్షంతో పాటు పడిన పిడుగు ధాటికి సమీప చెట్టుతోపాటు పక్కనున్న ద్విచక్రవాహనం దగ్ధమైందని కుమారి తెలిపారు.

వ్యసనాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత దేవి

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలత దేవి సూచించారు. శుక్రవారం స్థానిక కళాశాలలో మహిళా సాధికారిక శాఖ ఆధ్వర్యంలో పీఎం ఉష జీవితఃఐ స్కీమ్ ద్వారా మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాయామం, యోగా ద్వారా మానసిక ప్రశాంతను పొందాలన్నారు. వ్యసనాలకు లోనైతే వారిలో ఉన్న మానసిక స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎస్.రసూల్, గైనకాలజిస్టు డాక్టర్ పూర్ణిమ, అధ్యాపకులు కె.నిర్మల, టి.సుమిత్ర, రాధాకుమారి, బిందు, ప్రసన్న, డాక్టర్.వాణి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానంపై నిరసన

» ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్


పాడేరు మెడికల్ కాలేజీ ముందు వైసీపీ నేతలు, శ్రేణుల నిరసన

పాడేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలకు పీపీపీ విధానం రద్దు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదుట ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణు లు శుక్రవారం ఇక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సేవలు, వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనుజారాణి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, అదీప్‌రాజ్, కేకే.రాజు, వాసుపల్లి గణేశ్, జీసీసీ మాజీ చైర్మన్ స్వాతిరాణి, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశమి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) పాడేరు మెయిన్ బజారులో ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించ నున్న విజయదశమి మహోత్సవ పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు వెయ్యాకుల సత్యనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఏరువాక వెంకటరమణ, కమిటీ ప్రతినిధులు వి.సత్యనారాయణ, ఎస్. నాగేశ్వరరావు, పి.బుజ్జి, బి.రవి, ఉపాధ్యక్షులు, వైస్‌ఎంపీపీ జి.శివ కుమార్, బి.ఈశ్వరరావు, కె.వలసంనాయుడు, వర్తక సంఘం ప్రతినిధులున్నారు.

'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట'

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ పార్టీ డివిజన్ నేత, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు. దారెల పంచాయతీ గన్నెడ గ్రామంలో శుక్రవారం ఆయన ఆయన ఆధ్వర్యంలో గిరిజన రైతులకు రాయితీ నిమ్ ఆయిల్ పంపిణీ చేశారు. గన్నెడ గ్రామానికి చెందిన కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి పాండురంగస్వామి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి కూడా వరలక్ష్మి, టీడీపీ పంచాయతీ అధ్యక్షులు చవితీయ గోపాలం, నేతలు దన్ను, గద్దర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

» విపత్తుల నివారణపై ఎన్‌టీఆర్‌ఎఫ్ బృందాల విన్యాసాలు


గాయపడిన బాధితుల్ని ఆస్పత్రికి తరలిస్తున్న ఎన్‌టీఆర్‌ఎఫ్ సిబ్బంది

పాడేరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఎన్‌టీఆర్‌ఎఫ్ బృందాలు విపత్తుల నివారణలో చేపట్టే చర్యలపై నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. ముఖ్యం గా వరదల సమయంలో ఇళ్లు కూలిపోవడం,ఇళ్లపై చెట్లు కూలిపోవడం, ఆ సమయంలో బాధితుల్ని రక్షించడం వంటి చర్యలను కళ్లకుకట్టినట్లుగా ప్రదర్శించారు. ఎన్‌టీ ఆర్ఎఫ్ బృందాలు పలు విన్యాసాలను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ

విపత్తుల పై అవగాహన చేసుకోవాలి: జేసీ

ప్రజలు విపత్తుల నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ సూచించారు. మాక్‌డ్రిల్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజల్లో విపత్తులపై అవగాహన, చైతన్యం తీసు కురావాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం మాక్‌డ్రిల్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు అవగాహన ఉంటే అత్యవసర సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని, పలువురి ప్రాణాలు కాపాడే అవకాశం ఉం టుందన్నారు. ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, తదితరులు విపత్తుల నివారణపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో విపత్తుల నిర్వహణ నోడల్ అధికారి ఎంవీఎస్.లోకేశ్వరరావు, తాహసీల్దార్ అరుణ్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన


మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల జేఏసీ నాయకులు శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో ముందస్తు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకులు లకే నానిపాత్రుడు మాట్లాడు తూ గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర శాఖ ఉద్యోగుల సూచనల మేరకు నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు సమ్మె నోటీసు అందించామన్నారు. జిల్లా జేఏసీ నాయకులు పూజారి సత్యవతి, కృష్ణ, నాగేంద్ర, శివ, రమేశ్, మీనాక్షి, వెంకటలక్ష్మి, భారతి, లీలాప్రసాద్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాడేరురూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజకు సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్.సుందరరావు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ పాడేరు జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆస్పత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 2024 నవంబర్‌లో విడుదల చేసిన కొత్త జీవో (18600)ను వెంటనే అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ముత్యాలమ్మ, కార్యదర్శి రఘు, చిట్టిబాబు, పుణ్యవతి, కొండమ్మ, శివ, పాడేరు, మెడికల్ కళాశాల, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆస్పత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుపాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

» పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి జయరాజు


బోడిగపుట్టులో పశువులకు టీకాల కార్యక్రమంలో పాల్గొన్న జయరాజు

హుంకుంపేట సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) పశువులకు గాలి కుంటి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధఖ శాఖ జిల్లా అధికారి జయరాజు రైతులకు సూచించారు.శుక్రవారం మండలంలోని రంగశీల పంచాయతీ బోడిగపుట్టు, పాటిమాడి గ్రామాల్లో టీకాల కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎఫ్ఎంటీ టీకాలు వేయాలన్నారు. లేకుంటే పశువులకు వ్యాధి ప్రబలితే త్రీవంగా నష్టపోతారన్నారు. ఈనెల 15 నుంచి వచ్చే నెలా 15వతేదీ వరకు గ్రామాల్లోకి వచ్చి వైద్య సిబ్బంది శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎడ్యుకేషన్‌పై సెమినార్

పాడేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో 9, 10వ తరగతి విద్యార్థినులకు సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ, ఆశా జ్యోతి (యూఎస్) ఆధ్వర్యంలో సైన్స్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.జగదీశ్ విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం ప్రాధాన్యతను వివరించారు. ప్రకృతిలో విషయాలతో పాటు పుస్తకాల్లో విషయాలను ప్రశ్నిస్తేనే సైన్స్‌ను అర్థం చేసుకోగలుగుతామన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ప్రయోగాలు, వీడియోల ద్వారా ఖగోళశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, బయాలజీ తదితర శాస్త్రాలలో శాస్త్రవేత్తలు ఏవేవి కనుగొన్నారో స్టోరీ ఆఫ్ ఎవ్రిథింగ్ అనే కాన్సెప్ట్ ద్వారా విద్యార్థులకు వివరించారు. పాడేరు ఐటీడీఏ ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జగదీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 9, 10వ తరగతులకు చెందిన 270 మంది విద్యార్థినులు, హెచ్‌ఎం ఎల్.సలోమి, ఉపాధ్యాయులు శెట్టి రత్నశ్రీ, ప్రసన్న పాల్గొన్నారు.

సాంస్కృతిక, విజ్ఞాన పోటీల్లో డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ


గ్రూప్ డ్యాన్స్‌లో విజేతలకు ధ్రువపత్రాలు, జ్ఞాపిక అందజేసిన ప్రిన్సిపాల్ మంజుల

చింతపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లి వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక, విజ్ఞాన పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఈసందర్భంగా స్థానిక కళాశాల విద్యార్థినులు సోలో సింగింగ్, గ్రూప్ సాంగ్స్, గ్రూప్ డ్యాన్స్‌లో ప్రథమ బహుమతులు, నూతన సాంకేతికతతో హైడ్రాలిక్ బ్రిడ్జీ నిర్మాణ ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించింది. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల అధ్యాపకులు డాక్టర్ కెజియా, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మయూరి పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల రిలే దీక్షలు



పాడేరు సర్కిల్ ఆఫీసు వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పాడేరురూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యలపై రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పాడేరు సర్కిల్ కార్యాలయం వద్ద విద్యుత్ సిబ్బంది రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో ఉన్న ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్‌లకు కొత్తగా నియమించనున్న ఉద్యోగులకు పాత సర్వీస్ నిబంధనలు వర్తింపచేయాలన్నారు.బకాయిపడిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. తొలి రోజు రిలే నిరాహార దీక్షలలో 327 యూనియన్ డివిజనల్, రీజనల్ సెక్రటరీ సీహెచ్.త్రిమూర్తులు, 1104 యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ పి.సింహాచలం, కోపరేటివ్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ బి.నిరీష, లైన్‌మేన్ పి.సోమేష్, అవుట్ సోర్సింగ్ కార్మికుల డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీలేరులో జెన్‌కో ఉద్యోగులు...

సీలేరు: సీలేరులో జెన్‌కో ఉద్యోగులు సెంట్రల్ విద్యు త్ జేఏపీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక జెన్‌కో ఈఈ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.విద్యుత్ జేసీఏసీ నాయకులు వై. సత్తిబాబు, వై. దాలిరాజు, సుకుమార్, శ్రీ.నివాస్, రాంబాబు, భాస్కర్ కూర్చున్నారు. జేఏసీ నాయకులు పాండురంగా, భవానీ శంకర్, ఎస్ నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

236 మందికి వైద్య పరీక్షలు


ముంచంగిపుట్టు సీహెచ్‌సీ ఆవరణలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబి రానికి మంచి స్పందన లభించింది. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కెగీతాంజలి ఆధ్వర్యంలో 236 మందికి అప్తమాలజీ, చిన్న పిల్లల వైద్య నిపుణులు, జనరల్ వైద్య నిపుణులు వాసవి, ప్రభావతి, అనూష, చందనశ్రీ, ధరణీలు వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. సీహెచ్‌సీ డాక్టర్ వివేక్, వైద్య సిబ్బంది, కిలగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చెరుకుబిడ్డలో బాలింతలతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి మంజుభార్గవి

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డలో లంగుపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి మంజుభార్గవి, రాకేశ్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్యసేవలను అందించారు.కివర్లలో పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వెంకటేశ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా క్టర్ బాలాజీ, పీహెచ్‌ఎన్. పి.వెంకటలక్ష్మి ఎంపీహెచ్‌ఈవో రాజారావు, సర్పంచ్ రాములమ్మ, హెచ్‌ఈ రవి, హెచ్‌ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పెదబయలు, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) మహిళల కోసం స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించినట్టు రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి పి. సత్యారావు తెలిపారు. పర్రెడా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చేనెల 15వ తేదీ వరకు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కా ర్యక్రమంలో సిబ్బంది రామారావు, కళావతి, అనితకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చింతపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సేవలతో గుర్తింపు సాధ్యమని స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్ అన్నారు. శుక్రవారం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులు జి.నీలేంద్రం, చింతాడ శివలింగంనాయుడు, మామిడి రమణబాబు, నూతనంగా పాఠశాలలో నియమితులైన ఉపాధ్యాయులకు ధారకాని వెంకటరమణ, కంకిపాటి వీరన్నపడాల్, జంగం ఆనందరావు, సాగిన వెంకటేశ్‌లను సహోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.డీ కంకిపాటి రామకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయుడు కిట్టంగి ప్రసాద్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో కృష్ణప్రసాద్

చోద్యంలో జిల్లాస్థాయి సెపక్ తక్రా ఎంపిక పోటీలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని గొలుగొండ ఎంఈవో కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17 జిల్లాస్థాయి బాల, బాలికల సెపక్ తక్రా ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆట అయిన సెపక్ తక్రా ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతుందన్నారు. పోటీల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ సభ్యులు అచ్చియ్యమ్మ, రాజు, నూకరాజు, టీవీ రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ పోతల సత్తిబాబు పాల్గొన్నారు.

రైతులకు రీసర్వే నోటీసులు ఇవ్వాలి



తహశీల్దార్ వెంకటరమణతో మాట్లాడుతున్న రైతులు

మాకవరపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూములను రీసర్వే చేసి నెల రోజులు కావస్తున్నా.. ఇప్పటికీ 92 నోటీసులు ఇవ్వలేదని లచ్చన్నపాలెం రైతులు తహశీల్దార్ జి. వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వారు తహశీల్దార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో భూములను రీసర్వే చేసి నోటీసులు ఇవ్వలేదన్నారు. నోటీసులు ఇవ్వకపోతే రికార్డుల్లో భూమి ఎంత నమోదు అయ్యిందో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ రైతులందరికీ త్వరలోనే 92 సర్వే నోటీసులు అందజేస్తామని చెప్పారు.

సారా నియంత్రణకు కఠిన చర్యలు

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నవోదయం 2.0 లో భాగంగా సారా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో సారా తయారీ, అమ్మకాలకు పాల్పడుతున్న 255 మందిని బైండోవర్ చేశామని, బైండర్ చేసిన తర్వాత కూడా సారా కేసులో దొరికిన వారికి రూ.10 వేలు చొప్పున ఆరుగురుకి జరిమానా విధించామని చెప్పారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు హిమ బిందు

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు బలిఘట్టం హైస్కూల్ విద్యార్థిని ఎంపికైంది. శుక్రవారం బీమిలి కేథరిన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో 8వ తరగతి విద్యార్థిని సర్వసిద్ధి హిమబిందు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటలకు ఎంపికైంది. బాలికను హెచ్‌ఎం శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు అభినందించారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంపీడీవో సత్యశ్రీనివాస్

నాతవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఎం. సత్య శ్రీనివాస్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన చినగొలుగొండపేట ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని ఉపాధ్యాయులు ఎంపీడీవో దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల తరగతులకు వెళ్లి వివిధ ప్రశ్నలు అడిగి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నది లేనిది పరిశీలించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణతో కలిసి చినగొలుగొండపేటలో పారిశుధ్య పనులను, సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

మాకవరపాలెం : పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని గర్ల్ చైల్డ్ డెవలమెంటు ఆఫీసర్ జెమీయా తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు బాలికల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిపి భోజనం చేశారు. ఆమెతో పాటు విద్యాలయం ప్రత్యేక అధికారి త్రివేణి ఉన్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శేఖర్



ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

చోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రీజియన్ రికగ్నయిజ్డ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ చోడవరం డివిజన్ అధ్యక్షుడిగా బంటు శేఖర్ (రవికాన్వెంట్, చోడవరం) ఎన్నికయ్యారు. ఏడమ్స్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా రాజాబాబు (రాజాపబ్లిక్ స్కూల్, వీరనారాయణం), కార్యదర్శిగా రామపాపారావు (దేవరాపల్లి), సంయుక్త కార్యదర్శిగా పట్నాయక్ (రావికమతం), కోశాధికారిగా ఐబీవీ ఆర్‌ఎం రాజు (గోవాడ) ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి 250 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువగా ఉంది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా శుక్రవారం సాయంత్రానికి 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.45 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కొనసాగుతున్నందున నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాత్రి ఎనిమిది గంటలకు మూడో గేటు తెరిచి 250 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నామని జలాశయం ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు శ్రీకారం

- నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో 300 సీట్లు
- 191 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు
- విద్యార్థులకు సీట్ల కేటాయింపు
- 22వ తేదీతో ముగియనున్న ప్రక్రియ

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ మేజర్ సబ్జెక్టులో డిగ్రీ ప్రవేశాలకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. తొలి విడత ప్రవేశాలకు ఈనెల 3 వరకు ఆన్‌లైన్‌ల రిజిస్ట్రేషన్, 6 నుంచి 10 తేదీ వరకు ఆప్షన్స్‌కి అవకాశం ఇచ్చారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు సీట్లు కేటాయింపు ప్రక్రియ చేపడుతున్నారు. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో డిగ్రీ ప్రవేశాలు చేపట్టడానికి గత నెల 10 తేదీన ఉన్నత విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2025-26 సంవత్సరానికి నర్సీపట్నం డిగ్రీ కళాశాలకు 300 సింగిల్ మేజర్ సబ్జెక్టు సీట్లు కేటాయించారు. బీఏ హిస్టరీ 40, బీఏ పొలిటికల్ సైన్స్ 40, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ 60, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 40, బీఎస్సీ ఫిజిక్స్ 40 సీట్లు కేటాయించింది. డిగ్రీలో చేరడానికి 191 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గురువారం నుంచి కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసి సీట్లు కేటాయింపు చేస్తున్నారు. శుక్రవారానికి 132 మందికి సీట్లు కేటాయింపు చేశారు. సోమవారం వరకు సీట్లు కేటాయింపునకు గడువు ఇచ్చారు. తర్వాత రెండో విడత డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థులకు అవకాశం ఇస్తారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కి వచ్చిన విద్యార్థులు

బీఎన్ రోడ్డు పనులు త్వరగా చేపట్టండి

చోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీరు(ఎన్‌డీబీ) వీకే విజయశ్రీ కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె మండలంలోని గంధవరం నుంచి అంబేరుపురం, గోవాడ ప్రాంతాల్లో దారుణంగా దెబ్బతిన్న బీఎన్ రోడ్డును పరిశీలించారు. చోడవరం నుంచి వడ్డాది వరకూ దెబ్బతిన్న రహదారితో పాటు వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వేలను కూడా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రహదారి పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను చీఫ్ ఇంజినీరుకు గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ వివరించారు.

బుచ్చెయ్యపేట : విజయరామరాజు పేట వద్ద డైవర్షన్‌ను, బీఎన్ రోడ్డును ఆర్ అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ (ఎన్డీబీ వర్క్స్) వికే. విజయశ్రీ శుక్రవారం పరిశీలించారు. భీమునిపట్నం. నర్సీపట్నం రోడ్డుకు నిధులు మంజూరైనా పనులప్రారంభించలేదు. దీంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా చోడవరం సబ్ కోర్టులో న్యాయవాదులు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేశారు. సీఈ విజయశ్రీ గంధవరం నుంచి రోలుగుంట వరకు బీఎన్‌రోడ్డు, వంతెనను పరిశీలించారు. సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు రహదారుల సమస్యలను ఆమెకు వివరించారు. ఆమెతో పాటు ఈఈ సాంబశివరావు, అనకాపల్లి ,నర్సీపట్నం డివిజన్ డీఈలు, ప్రభు, విద్యాసాగర్, జేఈలు సత్యప్రసాద్, సాయి శ్రీనివాస్, విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



అంభేరుపురం వద్ద బీఎన్ రోడ్డును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీరు విజయశ్రీ

పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలి



స్థానికులతో మాట్లాడుతున్న విజయ్

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శుక్రవారం పర్యటించారు. తొలుత ఆయన బీసీ కాలనీలో వరహాలదొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదు చేశారు. చెత్త తరలించడానికి ట్రాక్టర్లు రావడం లేదని, బీసీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనంలో అసాంఘిక కార్యకలాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబుకు సూచించారు. ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి వార్డులో లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తా నని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి లాలం మురళీకృష్ణ, రావణాపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ వారోత్సవాలు



బాలికలు తయారుచేసిన కిట్లను చూపుతున్న దృశ్యం

చీడికాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చుక్కపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివాస్ కార్యక్రమాన్ని హిందీ వారోత్సవాలను సుధీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం బి.వి.రమణతోపాటు ముఖ్య అతిథిగా కింతలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు. దీనిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారుచేసిన బోధనాభ్యాస సామగ్రి, పలు మోడల్స్ ప్రదర్శించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హిందీ విభాగంలో పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన నాయకులు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎంపీడీవో శివ ప్రసాద్‌ను జడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్‌లు, మండలంలో వైసీపీ నాయకులు, మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె అచ్చంనాయుడు, కే జనారన్ రావు, జోగా కొండబాబు, నారాయణ మూర్తి, వైస్ ఎంపీపీ లలిత, చిన బాబు, సర్పంచ్ విజయకుమార్, అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు కెవి రమణ, కోరుకొండ రమణ, నాయకులు గాంధీ, శనివాడ అప్పారావు, సీతా గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ మహిళ అధ్యక్షురాలు నీలవేణి తదితరులు

రావికమతం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులందరూ పొందాలని టీడీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి అన్నారు. కొత్తకోటలో శుక్రవారం ఆమె కార్డుల పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇకపై ఏ సంక్షేమ పథకం పొందాలన్న ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డు తప్పని సరిఅన్నారు. పాత రేషన్ కార్డులతో వేలి ముద్రలు పడక అవస్థలు పడేవారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్‌రేషన్ కార్డును మంజూరు చేశారన్నారు. కొత్తకోటలో 8 రేషన్ డిపోల పరిధిలో 3500 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గట్టా నానాజీ,వెల్లంకి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు స్థల సమస్య పరిష్కరించాలి



అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రావికమతం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డంపింగ్ యార్డు స్థల సమస్యను అధికారులు పరిష్కరించాలని సర్పంచ్, ఇతర ప్రతినిధులు ఎంపీడీఓ మహేశ్, తహశీల్దార్ అంబేడ్కర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ గంజి మంగ, మోదునాయుడు, ఎంపీటీసీలు గంజి సూర్యనారాయణ,వేపాడ లక్ష్మి, నాగేశ్వరావు, గంజి వెంకటరమణ, ఉప్పులూరి నాగేశ్వరావు తదితరులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డుకు స్థలం లేక గ్రామంలో సేకరించిన చెత్తను ఆవాసాల మధ్య వేయాల్సివ స్తోందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని అధికారులను వారు కోరారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల ఆందోళన




తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

మాడుగుల, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఎం. క్రిష్ణాపురంలో గొర్రెలు, మేకల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ళ వరహాలనాయుడిపై దాడి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్ర ప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి గోకాడ దేవుడునాయుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, సంఘ వైస్ చైర్మన్ పెద్ద శ్రీనివాసరావు,ఉరిగిటి శివ సూర్యనారాయణ, కోన నాగేశ్వరరావు, ఏదిరి అప్పారావు, మెల్లి అప్పారావు, చందక తాతారావు, పాల్గొన్నారు.

అట్టపెట్టెలతో అయోధ్య రామ మందిరం నమూనా

చోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆడమ్స్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి జి. నిరూప్ అట్టపెట్టెలతో అయోధ్య రామమందిరం నమూనా తయారు చేశారు. ఖాళీ అట్టపెట్టెలను ఉపయోగించి అందంగా తీర్చిదిద్దిన నమూనాను స్కూల్ డైరెక్టర్ బద్రిమహంతి ఫల్గుణ్‌తో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నమూనాను విద్యార్థుల కోసం స్కూల్‌లో ప్రదర్శనకు ఉంచారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు

చోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 440 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వీరిలో 40మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు.

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

చోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ప్రైమ్‌కార్డు 2.0 విధానంలోని సాంకేతిక లోపాలు చక్కదిద్దాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం పెన్ డౌన్ పాటించారు. కొత్తూరు జంక్షన్‌లో శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక డాక్యుమెంట్ రైటర్ల సంఘం అధ్యక్షుడు వడ్డాది రమేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రైమ్‌కార్డు 2.0 విధానంలో ఓటీపీల వల్ల సైబర్ నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగుచ డాక్యుమెంట్ సబ్మిట్ చేసిన తరువాత, ఎడిట్ ఆప్షన్ లేకపోవడం వల్ల కూడా అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీనిపై ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండిపడడంతో పాటు, రిజిస్ట్రేషన్ల పరంగా ప్రజలకూ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు సీతారామయ్య, నాయకులు బొబ్బిలి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రామారావు, శ్రీనివాస్, నారాయణరావు, సంతోష్, నాయుడు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో దీక్షా శిబిరంలో డాక్యుమెంట్ రైటర్లు

మాడుగులలో..

మాడుగుల రూరల్ : మండల దస్తావేజు లేఖరులు శుక్రవారం నిరసన చేపట్టారు. మండలంలోని స్వయం శక్తి దస్తావేజు లేఖర్ల సంఘం సభ్యులు శుక్రవారం మాడుగుల రిజిస్ట్రార్ కార్యాయం వద్ద పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టినట్టు స్వయంశక్తి సంఘం అధ్యక్షులు కాశీప్రకాశ్, ఉపాధ్యక్షులు కోడూరు వెంకటరమణ తెలిపారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గొలుగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని గొలుగొండ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి తెలిపారు. శుక్రవారం పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భ్రమరాంబ, సూపర్‌వైజర్ రాఘవ పాల్గొన్నారు.

దేవరాపల్లి : పోషక విలువలతో తల్లీబిడ్డకు ఆరోగ్యపరంగా శ్రేయస్కరమని కె.కోటపాడు అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి పి. లలితకుమారి అన్నారు. చింతలపూడి, తామరబ్బ పంచాయతీల్లో పోషణ మాసోత్సవాల్లో భాగంగా సమావేశాలు నిర్వహించారు. అలాగే, స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా 164 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

దోమ తెరలు పంపిణీ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దోమ తెరలు వినియోగించడం వల్ల జర్వాలు దరిచేరవని పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ పడాల్ అన్నారు. శుక్రవారం ఆయన గాదంపాలెం గ్రామంలో దోమ తెరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేసుకల్ల అప్పారావు, టీడీపీ నాయకులు లగుడు నానిబాబు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి



కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ శ్రేణులు

మాకవరపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అప్పగించడాన్ని రద్దు చేయాలని నరీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి భీయిబోయినపాలెం వైద్య కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీపీపీ విధానం వల్ల పేదలకు వైద్యంతో పాటు పేద విద్యార్థులకు వైద్య విద్య పూర్తిగా దూరమవుతుందని చెప్పారు. అనంతరం ఎస్ఐ దామోదర్‌నాయుడుకు నోటీసు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, ఎంపీపీ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి

నర్సీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌లో బాగా చదువుకుంటే పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మద్దిలి వినోద్‌బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాగా చదివి ఐఐటీ, నీట్, ఇంజనీరింగ్ వంటి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ పద్మావతి, అధ్యాపకులు శర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చీడికాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి : మండల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ నిలుపు చేయనున్నట్టు ఏఈ వెంకటరావు శుక్రవారం తెలిపారు. తురు తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, వింటిపాలెం, చుక్కపల్లి, చెట్టుపల్లి, బైలపూడి, జైతవరం, కోనాం, శిరిజాం, మంచాల గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : మండలంలోని నిర్వహణ చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ క్రి.శంకరరావు తెలిపారు. ములకలాపల్లి, పెదనందిపల్లి, మారేపల్లి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోలుగుండలో..

రోలుగుంట : మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, నిండుగొండ గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రావికమతం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బూరుగుపాలెంలో గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గ్రామ టీడీపీ నాయకులు రూ.55 వేలు విరాళంగా శుక్రవారం అందజేశారు. సింబోతునాయుడు రూ.10 వేలు, పిల్లా శేషుబాబు (తట్టబంద ఎంపిటీసీ)రూ.10 వేలు, దేవర అప్పలనాయుడు రూ.10వేలు,దాట్ల సుదర్శన రాజు, చలపరెడ్డి చిట్టిబాబు, నమ్మి తిరుపతయ్య, ఎజ్జి అప్పలరాజు, మోటూరి గోవిందా రూ. 5 వేలు చొప్పున ఆలయ కమిటీ సభ్యులు బర్నికాన కొండబాబుకు అందించారు. అలాగే, నమ్మి భూరాజు, నమ్మి అర్జున 15 బస్తాల సిమెంట్‌ను అందించారు.

బైక్ బోల్తా పడి యువకుడి మృతి

పాయకరావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా శుక్రవారం రాత్రి బైక్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నక్కపల్లి మండలం ఉద్దం డపురం గ్రామానికి చెందిన బొడ్డే దివాకర్ (36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం ఉదయం బైక్‌పై పట్టణానికి వచ్చి రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, ఉన్నత పాఠశాల వద్ద ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడ్డాడు. ఈ సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ముందు వెళుతున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పురుషోత్తం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవన ఎరువులు భేష్



ఆర్ఏఆర్ఎస్‌లో తయారయ్యే ద్రవరూప, పొడర్ రూప జీవన ఎరువులు

సేంద్రియ, రసాయనిక ఎరువులతో కలిపి వాడాలి

- ఇదే సమీకృత ఎరువుల యాజమాన్య పద్ధతి
- మొక్కల ఎదుగుదలకు అన్ని విధాలా మేలు
- ఇతర ఎరువులతో పోలిస్తే ధర తక్కువ
- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో తయారీ
- పొడిరూప జీవన ఎరువు కిలో రూ.40
- ద్రవ రూప జీవన ఎరువు లీటరు రూ.300
- ఎక్కడికైనా రవాణా చార్జీలు ఉచితం

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి):

మొక్కలకు, పంటలకు సేంద్రియ ఎరువులు... రసాయనిక ఎరువులతోపాటు జీవన ఎరువులు కూడా వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ మూడు రకాల ఎరువులను వాడేదే సమీకృత యాజమాన్య పద్ధతి. ఇది అన్ని విధాలా మేలైనది. మొక్కల ఎదుగుదలకు, వాటి జీవనశక్తిని పెంచేందుకు జీవన ఎరువులు సాయపడతాయి. పంటలకు కావలసిన పోషకాలను వాతావరణం నుంచి నేల నుంచి గ్రహించి మొక్కలకు అందించే సూక్ష్మజీవుల సముదాయాన్ని జీవన ఎరువులు అంటారు. సహజసిద్ధంగా నేలలో ఉన్న సూక్ష్మజీవులు, నాచు, సిలింద్రాడాల చర్యల వలన మొక్కలకు ఎంతో మేలు కలుగుతుంది. శాస్త్రవేత్తలు పైర్లకు కావలసిన సూక్ష్మజీవులను వేరుచేసి, వాటిని అభివృద్ధి పరిచి జీవన ఎరువులను తయారు చేసే పద్ధతిని రూపొందించారు.

రసాయనిక ఎరువుల వలె ఇవి కృత్రిమమైనవి కావు. స్వాభావికమైనవి. జీవన ఎరువులలో ఉండే బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు గాలిలోని నత్రజని గ్రహించి మొక్కలకు నేల ద్వారా అందిస్తుంది. మొక్కల వేర్లకు పోషకాలను అందించే సిలీంద్రాలు కూడా కొన్ని రకాల జీవన ఎరువుల్లో ఉంటాయి. ఇవి మొక్కలకు సోకే తెగుళ్ల నుంచి కూడా రక్షిస్తాయి. నేల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయి. పర్యావరణానికి అనుకూలమైనవి. రసాయనిక ఎరువుల ధరలతో పోలిస్తే వీటి ధరలు చాలా తక్కువ.



సాయిల్ సైన్స్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శీలత

ఆర్ఏఆర్ఎస్‌లోనే ఉత్పత్తి

ఇంత ప్రాధాన్యం ఉన్న జీవన ఎరువులు అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లోనే తయారవుతున్నాయి. ఇక్కడ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.



అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో జీవన ఎరువుల యూనిట్

ఎరువుల ధర చెల్లిస్తే చాలు ఆర్ఏఆర్ఎస్ రవాణా చార్జీలను భరిస్తుంది. ఆర్ఏఆర్ఎస్‌లో ఉన్న జీవన ఎరువుల తయారీ యూనిట్లో ద్రవ రూప జీవన ఎరువులు కూడా తయారవుతున్నాయి. ఈ కర్మాగారానికి 100 టన్నుల పొడి రూప జీవన ఎరువులు, 100 టన్నుల ద్రవరూప జీవన ఎరువులు తయారు చేసే సామర్థ్యం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో నెలలో 30 వేల లీటర్ల జీవన ఎరువులను తయారు చేసి రైతులకు అందజేస్తున్నది. ఈ ఎరువులు కావలసినవారు ముందుగా ఏ మేరకు కావలన్నది ఇండెంట్లు రూపంలో ఆర్ఏఆర్ఎస్‌కు తెలియజేయాలి. పొడిరూప జీవన ఎరువులు కిలో రూ.40 కాగా, ద్రవ రూప జీవన ఎరువులు లీటరు రూ.300. ఒకసారి ఈ ఎరువులను వాడిన రైతులు తిరిగి పదేపదే ఈ కావాలని ఇండెంట్లు పెట్టడం ఈ ఎరువుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నదని భూశాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీలత చెప్పారు.

వాడకం పెరుగుతోంది..

జీవన ఎరువుల్లో మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు కోట్లాది సంఖ్యలో ఉంటాయి. నేలకు వేసినపుడు వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయి మొక్కలు పెరగడానికి అవసరమైన హార్మోన్లు, విటమిన్లు ఉత్పత్తి అవుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తగినంత సేంద్రియ ఎరువులు లభ్యం కానందున రసాయనిక ఎరువులు ధరలు అధికంగా ఉన్నందున జీవన ఎరువుల వాడకం పెరుగుతోంది.

జీవన ఎరువుల రకాలు..

నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు, భాస్వరాన్ని అదుపులోకి తెచ్చేవి అనే రెండు రకాలుగా వీటిని వర్గీకరించవచ్చు. వరి, వేరుశనగ, పప్పు ధాన్య పైర్లకు నత్రజని జీవన ఎరువులను వినియోగించాలి. వీటిలో రైజోబియం, అజిటు బాక్టర్, అజోస్పైరిల్లం, అసిటోబాక్టర్, అజోల్లా ముఖ్యమైనవి. అనకాపల్లిలో అజిటుబబ్యాక్టర్, అజోస్పురిల్లం ప్రధానంగా తయారవుతున్నాయి. ఇవి రెండూ ఎకరానికి 8 నుంచి 16 కిలోల నత్రజనిని అందజేస్తాయి.

భాస్వర జీవన ఎరువులు

ఇవి కొన్ని రకాల సూక్ష్మజీవులు శిలీంద్రాల ద్వారా భూమిలో నిల్వ ఉండి భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తీసుకువస్తాయి. భాస్వరం అందించడానికి పాస్ఫో బ్యాక్టీరియా, మైకోరైజా జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

ఉపయోగించే పద్ధతి

జీవన ఎరువులను పొలంలో చల్లడం ద్వారా కాని విత్తనాలకు పట్టించడం ద్వారా గాని ఉపయోగిస్తారు. వీటిని నేరుగా కాక సేంద్రియ ఎరువులతో కలిపి మొక్కలకు అందించాలి. అయితే జీవన ఎరువులు రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయం కాదు. అధిక దిగుబడుల కోసం రైతులు సమీకృత ఎరువుల పద్ధతిని అనుసరించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



జీవన ఎరువుల ల్యాబ్

క్రైం... crime news

మద్యం అక్రమ రవాణాలో ముగ్గురిపై కేసు

- ఇద్దరు అరెస్టు... మరొకరు పరారీ
- 70 బాక్సుల్లో 1680 కింగ్‌ఫిషర్ టిన్ బీర్లు లభ్యం
- మద్యం సీసాలు, వ్యాన్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు, వ్యాన్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఘటనలో ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నారని, ముగ్గురిపైనా కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ కేసులో వ్యాన్‌తో పాటు మొత్తం 70 బాక్సుల్లో 1680 టిన్ బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం బిల్లాయిపుట్టు పంచాయతీ నుంచి ఒడిశా మద్యాన్ని ఆంధ్రా మీదుగా తరలిస్తుండగా ముంచంగిపుట్టు మండలంలోని మారుమూల గ్రరం ప్రాంతంలో గురువారం సాయంత్రం పట్టుకున్నట్టు చెప్పారు. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, మద్యంతో పాటు వ్యాన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఒడిశాకు చెందిన మద్యం 70 బాక్సుల్లో 1680 కింగ్ ఫిషర్ టిన్ బీర్స్ ఉన్నాయన్నారు. వీటి విలువ సుమారు రూ2,35,200 ఉంటుందని చెప్పారు. మద్యం అక్రమ రవాణా కేసులో ముగ్గురుపై కేసు నమోదు చేశామని, వీరిలో జోలాపుట్టు(ఆర్ఎఫ్)కు చెందిన మహమ్మద్ అహ్మద్, గుప్తా ఖరలను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. వీరిని కోర్టుకు తరలించామన్నారు. అలాగే పరారీలో ఉన్న నిందితుడు జోలాపుట్టుకు చెందిన వ్యాపారి జగన్నాథంగా విచారణలో తేలిందన్నారు. మద్యం అక్రమ రవాణాకు ఉపయోగించన వాహనం సైతం జగన్నాథందేనని ఆయన తెలిపారు. మద్యం అక్రమ రవాణాలో అతను కీలక పాత్ర పోషించినట్టు విచారణలో తేలిందన్నారు. త్వరలో జగన్నాథంను అదుపులోకి తీసుకుని అరెస్టు చేస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో ఎస్ఐ రామారావు, పోలీసులు

గొలుగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి నట్టు ఎస్ఐ రామారావు శుక్రవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం చిన్నమల్లవరం గ్రామానికి చెందిన చొప్పా నాగరాజు గతంలో 216 కిలోల గంజాయిని రవాణా చేస్తున్నట్టు గుర్తించి, అప్పట్లోనే గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నాగరాజును అరెస్టు చేసి, కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

యూరియా అధికంగా వాడితే అనర్థాలు

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



రైతులకు సూచనలు చేస్తున్న మోహనరావు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంటలకు అధికంగా యూరియా వాడితే అనార్థాలే తప్ప ఎటువంటి లాభాలు ఉండవని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని గెడ్డపాలెం, దార్లపూడి గ్రామాల్లో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ యూరియాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అవసరం మేరకే యూరియాను వరి పంటకు వాడాలని సూచించారు. ప్రస్తుతం వరిలో సుడిదోమ, ఆకుముడత పురుగు ప్రారంభమై మొదటి దశలో ఉందని, యూరియా అధికంగా వాడితే అవి మరింత ఉధృతమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి సౌజన్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికలు



ఫెన్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తుమ్మపాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-14 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక పోటీలులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు సిద్ధం చేశారు. తొలుత ప్రముఖ వ్యాయామ ఉపాధ్యాయుడు పైసా మాస్టారును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దివ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కేఎంవీ సత్యనారాయణ, ఎం.సూర్యనారాయణ, కేఎం నాయుడు, సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని

పరవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తానాం ప్రభుత్వ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ఆర్.భువన ఎంపికైంది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో భువన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు కళాశాల ఏటీపీ పి.చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని భువనను కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని, పీఈటీ గౌరి, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో కూడా ప్రతిభకనబరచాలని ఆకాంక్షించారు.

పేటకు రెండో ఫ్లైఓవర్

... 5వ పేజీ తరువాయి

వరకు ఉన్న రైలు పట్టాలకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించనున్నట్టు రైల్వే శాఖ రెవెన్యూ శాఖకు ఇచ్చిన ల్యాండ్ ఎక్విజేషన్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో చాలావరకు ట్రాఫిక్ అంతరాయాలు తప్పుతాయి. అయితే పట్టణంలో ఫ్లైఓవర్ పనులు చేపట్టడం కోసం రైల్వే ఇంజనీరింగ్ అధికారులు గతంలో నాగరాజుపేటలో సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. మరి కొద్దిరోజుల్లో రైల్వే అధికారులు ఫ్లైఓవర్ పనులు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్న తరుణంలో పరిస్థితులు ఎలా ఉంటాయో వేచిచూడాలి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ఉద్యోగినితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఉద్యోగుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి పలువురు ఉద్యోగులు హాజరై తమ సమస్యలను తెలిపారు. ప్రతీ ఒక్కరి సమస్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 13 మంది ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందించారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 11, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఒకటి, గ్రామీణ నీటి సరఫరా శాఖకు ఒకటి ఉన్నాయి. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారిణి సబ్బులక్ష్మి, కలెక్టరు కార్యాలయ పరిపాలన అధికారి విజయ్‌కుమార్, పీజీఆర్ఎస్ సెల్ సూపరింటెండెంట్ సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి వరహాలదొర



నాగాపురంలో వైద్య సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతున్న డీఎంవో

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి కె.వరహాలదొర చెప్పారు. గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేట, సిహెచ్.నాగాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీని సందర్శించి ల్యాబ్‌లో మలేరియా కేసుల వివరాలు, సిబ్బంది పనితీరు, జ్వరాల సర్వే తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. అలాగే దోమతెరలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో డిసెంబరులో దోమతెరల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. మలేరియా నిర్మూలకు వైద్యులు, సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ చికెన్‌గున్యా, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు, వైద్య సిబ్బందికి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు మలేరియా నివారణ అధికారి జె.సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.రమణ, పీహెచ్‌సీ వైద్యులు ఎస్.గాయత్రి, జ్యోతి, సర్పంచులు రఘురామ్, పి.సత్యంనాయుడు, ఉప సర్పంచ్ సహదేముడు, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు మరమ్మతులు ఇక చేయలేం

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాలైతే ఈ గుంతల్లో కూరుకుపోయి ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోతున్నదని వివరించారు. ఈ గుంతలను పరిశీలించిన ఆమె తక్షణమే మరమ్మతులు చేయాలని ఆమె వెంట ఉన్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరావును ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ఖర్చుపెట్టిన రూ.10 కోట్లలో రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంతమేర పనులు చేపట్టామని, తమతో పనులు చేయించడమేగాని బిల్లు ఇవ్వకుంటే ఇకపై ఎటువంటి పనులు చేయలేమని కాంట్రాక్టర్ తేల్చిచెప్పారు. దీంతో కాంట్రాక్టర్‌పై ఆమె మండిపడ్డారు.

కనీసం గుంతలు పూడ్చడం చేతకాకుంటే కాంట్రాక్ట్ వదిలి వెళ్లిపోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ నిర్లక్ష్యం వలనే ఈ రోడ్డు ఇలా మారిందని మండిపడ్డారు. బడ్జెట్ విడుదల అయ్యాక మీ డబ్బు వస్తుంది.. ఎక్కడికి పోదు. ముందు పని చేయించండి అని సూచించారు.

అనంతరం చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో నిర్మాణంలో ఉన్న రోడ్ల పనులకు రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్న మాట వాస్తమేనన్నారు. బీఎన్ రోడ్డు బిల్లు ఒక్కటే కాదని, చాలా రోడ్లకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలకు కృషి చేస్తున్నామన్నారు. అప్పటి వరకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను తాత్కాలిక మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్లను కోరుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, డీఈఈ విద్యాసాగర్, ఏఈఈ సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అందని సేవలు

... 5వ పేజీ తరువాయి

చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను రేషనలైజేషన్ ద్వారా ఒక్కో సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, మహిళా పోలీస్, ఇంజనీరింగ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అసిస్టెంట్లను నియమించింది. అయితే ఇంజనీరింగ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను చాలావరకు ఆయా శాఖల అధికారులు తమ శాఖ పనులకు వినియోగిస్తుండడంతో సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పైగా ఇటీవల నిర్వహించిన బదిలీల్లో మండలం నుంచి 75 మంది వెళ్లగా.. ఇతర మండలాల నుంచి 55 మంది మాత్రమే వచ్చారు. దీంతో మండలంలోని పలు సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేక వెలవెలబోతున్నాయి. ప్రతి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా.. మండలంలో 25 సచివాలయాలకు ఏడుగురు మాత్రమే ఉన్నారు. మండలంలో పాత్రేరులో ఇద్దరు, పెంటకోటలో ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. పైగా సచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం సమస్యగా మారింది. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైతులకు అవసరమైన 1బి, ఇతర ప్రభుత్వ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీనికితోడు పలు సచివాలయాల్లో ప్రింటర్లు పాడై మూలకు చేరగా, పలుచోట్ల ప్రింటెడ్ స్టేషనరీ కొరత కారణంగా ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితులు తలెత్తాయి. సచివాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన సేవలందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన సబ్ ట్రెజరీ కార్యాలయ పనులు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం చేసిన తర్వాత చాలా కాలం పనులు ఆపేశారు. తర్వాత రెండు అంతస్తులు శ్లాబ్‌లు వేసి మళ్లీ పనులు ఆపేశారు. కాంట్రాక్టర్‌కి బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు పడుతూలేస్తూ జరుగుతున్నాయి. ప్రస్తుతం గోడల నిర్మాణం జరుగుతోంది. పనులు మొదలు పెట్టి 20 నెలలు కావస్తున్నది. త్వరగతిన పూర్తి చేస్తే ట్రెజరీ కార్యాలయాన్ని కొత్త భవనంలోకి తరలిద్దామని అధికారులు ఎదురు చూస్తున్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో నర్సీపట్నం, కోటవురట్ల సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాల పనులు ముందుకు సాగడం లేదు. కోటవురట్లలో 80 శాతం, నర్సీపట్నం 40 శాతం పనులు అయ్యాయి. పనులు పూర్తిచేసిన ప్రాప్తికి కాంట్రాక్టర్‌కి బిల్లులు మంజూరు కాలేదు.

'హెటెరో'లో యుఎస్ ఎఫ్‌డీఏ బృందం తనిఖీలు



హెటెరోలో యూఎస్ బృందం తనిఖీలు

నక్కపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెంలో గల హెటెరో డ్రగ్స్‌లో శుక్రవారం యుఎస్ ఎఫ్‌డీఏ బృందం (డ్రగ్స్ విభాగం) తనిఖీలు చేపట్టింది. కంపెనీ గోడౌన్లను అణువణువూ పరిశీలించింది. హెటెరో ఉత్పత్తి చేస్తున్న పలురకాల వ్యాక్సిన్లు అమెరికా సహా ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే యూఎస్ ఎఫ్‌డీఏ బృందం అక్తర్ నాయకత్వంలో ఈ తనిఖీలు చేసింది. ఈ తనిఖీలకు సంబంధించి వివరాలు వెల్లడించేందుకు హెటెరో ప్రతినిధులు ముందుకురాలేదు. దీనిపై సీఐ కుమారస్వామిని సంప్రతించగా యుఎస్‌కు చెం దిన బృందం వచ్చి తనిఖీలు నిర్వహించడం నిజమేనని చెప్పారు. ఇదిలావుండగా హెటెరో యాజమాన్యం ఉద్యోగులకు శిక్షణ నిమిత్తమంటూ కొన్నేళ్ల కిందట ఒక గోడౌన్‌ను నిర్మించింది. ఆ పక్కనే మరో ప్రైవేటు భవనాన్ని కూడా అద్దెకు తీసుకుంది. యుఎస్ బృందం తనిఖీలకు రావడంతో స్థానికంగా ఉన్న హెటెరో ప్రతినిధుల సూచనల మేరకు అక్కడ శిక్షణ పొందుతున్న సిబ్బంది పంట పొలాల్లోకి పరుగులు తీశారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం నుంచి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లేందుకు బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని పక్షి ఢీకొనడంతో అత్యవసర ల్యాండింగ్ చేసిన విషయం తెలిసిందే. టేకాఫ్ అయిన పది నిమిషాలకే విమానం రెండో నంబరు ఇంజన్‌ను ఓ పక్షి ఢీకొనడంతో పైలట్ అత్యవసర ల్యాండింగ్ చేశారు. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతోనే పెనుప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ఇటీవల గుజరాత్‌లో జరిగిన విమాన ప్రమాదాన్ని గుర్తుచేసుకుని ప్రయాణికులతో పాటు విమానాశ్రయ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు.

హెచ్చరించినా చర్యలు నిల్

విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సరిగ్గా నెల రోజుల కిందట విమానాశ్రయ పర్యావరణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా పారిశుధ్యం పైనే చర్చించారు. పోర్టు సమీప గెడ్డల్లో పూడికతీత చేపట్టలేదని, పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో డ్రైవర్లు ఆహార వ్యర్థాలు వేస్తున్నట్టు గుర్తించామని విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.పురుషోత్తం సమావేశంలో ఫిర్యాదు చేశారు. దీనివల్ల ఈ ప్రాంతంలో పక్షుల సంచారం పెరిగి విమాన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని కూడా ప్రస్తావించారు. గురువారం నాటి ఘటన విమానాశ్రయ పరిసరాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని విమాన ప్రయాణికులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టులోనే విమానం

పక్షి ఢీకొన్న ఘటనలో మరమ్మతులకు గురైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రస్తుతం విశాఖ విమానాశ్రయంలోనే ఉన్నట్టు సమాచారం. దానికి సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిసింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559